


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**77**

**(8 ‘ అక్టోబరు 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఫోనులు నిజానికి** ఎంతో ఉపకారం చేస్తాయి. కాళ్ళతీతలు రిక్షా, టాక్సీ, వగైరా ఖర్చులు లేకుండా దూరంలో వున్న వాళ్ళతో మాట్లాడమనే సౌకర్యం కల్పించి ఎంతో హాయినిస్తాయి.

ఏదైనా పనివుండి ఫోను చేస్తామనుకోండి. అవునంటే సంతోషమే. కాదనడం సంభవించినా - ఏదో అనేస్తారు. వారి ముఖం మనం చూడనక్కరలేదు. మన ముఖంలో దిగులు వాళ్ళు చూడరు.

"ఏదో ఎరుగున్న వాడుగదా అని అడిగితే ముఖం మీదే కాదనేశాడు" అని తలుచుకు తలుచుకుని బాధపడటం వుండదు.

***మీరెవరు? ఎక్కడినుంచి మాట్లాడటం?***

ఈ ఫోనుల సంభాషణల్లోకూడా కొన్ని చిక్కులున్నాయి. అదేం తమాషో ఫోను తీసి ఫలానావారు వున్నారా? అంటే ఉన్నారూ లేరూ అని చెప్పరు. వెంటనే "మీరెవరు?" అంటారు. మనం అర్జీ క్రింద సంతకం చేసినట్లు పూర్తిపేరు చెప్పాలి. ఆ తర్వాత "ఎక్కడ నుంచి ఫోను చేస్తున్నారు?" అని ప్రశ్న.

"ఫలానా చోటినుంచి స్వామీ" అని చెప్పాలి.

ఇంతట్లోనే మరొకరు ఆ ఫోను తీసుకుని "ఇంతకూ మీకు కావలసిందెవరండీ?" అని ప్రశ్న.

"చెప్పాను కాదండీ! ఫలానావారు కావాలి" అని చెపుతాం.

"ఆయనలేరండి ఊరు వెళ్ళారు."

"ఊరు వెళ్ళారా!? ఎప్పుడు వస్తారో తెలుసా కొంచెం అర్జంటు పనివుంది వారితో."

"ఎప్పుడు వస్తారో తెలియదు" అని దభాలున ఫోను పెట్టేస్తారు.

కొందరు పాపం దయతలచి "బహుశః నాలుగురోజుల్లో రావచ్చు" అని చెపుతారు.

నాలుగురోజులైన తర్వాత మళ్ళా ఫోను చేస్తే "అవునండీ వూరు వెళ్ళారు. అయిదారు రోజుల్లో రావచ్చు" అంటారు. అడిగిన కొద్దీ గడువు పెరుగుతోందేమిట్రా పరమాత్మా! అని ఊరుకోవాలి. అంతకన్నా చేసేదేం వుంటుంది?

ఒక్కొక్కప్పుడు మళ్ళీ ఎప్పుడు పిలవాలో తోచక "చూడండి మా ఫోను నెంబరిస్తాం. కొంచెం వారు రాగానే ఫోను చెయ్యమంటారు" అని అడగడం జరుగుతుంది. ఫోన్ నెంబరు మాత్రం తీసుకుంటారు కానీ ఆరు నెలలు ఎదురు చూసినా వారు ఫోన్ చెయ్యడమంటూ ఉండదు.

***అరగంట ఆగి పిలవండి: ఇది లంచ్ టైం.***

ఇటీవల ఉద్యోగంలో ఉన్న ఒక మిత్రుడి ఇల్లు ఎక్కడో కనుక్కుని వాళ్ళ యింటికి వెళ్ళి చూసివద్దామని అయిదారుసార్లు ఆఫీసుకి ఫోను చేశాను. ఒకసారి అడిగితే మీటింగ్‌లో ఉన్నాడన్నారు. మరోసారి అడిగితే "లంచ్ తీసుకుంటున్నారు ఒక గంట ఆగి చెయ్యండి" అన్నారు. గంట ఆగి చేశాను. "రెస్టు తీసుకుంటున్నారు ఇంకో గంట ఆగి ఫోను చేస్తాను సరే - ఆయన ఆఫీసులో పని ఎప్పుడు చేస్తున్నాడు" అని అడుగుదామనిపించింది. కానీ ఉన్న మొహమాటం కాస్తా ఊడిపోతుందని ఊరుకొన్నాను చివరికి తెగించి ఆ పలుకుతున్న పెద్ద మనిషినే వారి యింటి ఎడ్రసు చెపుతావా? అన్నాను. "ఒక అరగంట ఆగి ఫోను చెయ్యండి అయ్యగారినడిగి చెపుతాను - ఇప్పుడెవరితోనో మాట్లాడుతున్నారు" అని గభాలున ఫోను పెట్టేశాడు.

చాలామంది మాత్రం "మీరెవరు?" అని అడగడం జరుగుతుంది. ఒకరోజు వరసగా ఆరుగురు ఇదే ప్రశ్న వేశారు.

"అవతల పెద్దమనిషి పలకవచ్చు. మరేం ప్రమాదం లేదు. నేను సామాన్యమైన మనిషినే. అయినా ఫోన్‌లో కరుస్తానా?" అనాల్సిన సందర్భం వచ్చింది.

***అమ్మగారి తాలూకేమోనని అడిగా!***

"అదికాదండి. అయ్యగారు ఈపూట ఎవరు ఫోను చేసినా వారికి కనెక్షన్ ఇవ్వవద్దు, లేరని చెప్పమన్నారు." అన్నాడు.

"మరి అంతకాడికి పేర్లు అడగడం, ఈ పరామర్శ దేనికి?" అన్నాను.

"ఒకవేళ అమ్మగారు ఇంటిదగ్గర మంచి ఫోను చేస్తారేమో వారికి మాత్రం కనెక్షన్ ఇద్దామని" అన్నాడు.

"అమ్మగారిది ఆడగొంతుక కాదుటయ్యా. మొగాళ్ళ పేర్లు అడుగుతావెందుకు? అన్నాను విసుగ్గా.

"అమ్మగారు ఒకప్పుడు డ్రైవర్ చేతా, ఒకప్పుడు నౌకరుచేతా, ఒకప్పుడు ఇంటికొచ్చిన చుట్టాల చేత ఫోను చేయిస్తూవుంటారు. అలాటప్పుడు మొగాళ్ళందరు లేరని చెప్పేస్తే తంటాకాదూ" అన్నాడు పాపం.

ఫోను చేసేవాళ్ళ అవస్థలు చేసే వాళ్ళని అక్కడ జవానులు చెప్పేవాళ్ళ తిప్పలు వాళ్ళవి. ఫోనులోకూడా సరాసరి పలకరించే సదుపాయాలుండవు. అక్కడా తమాషా చెక్కింగ్లు ఉంటాయి. అవతల మధ్య మనిషి దొరకడం అనేది ఒకప్పుడు లాటరీ అవడం కూడా కద్దు.

***ఎప్పుడు ఫోను చేసినా బయటే వుంటాడు.***

కొందరికి ఫోను చేస్తే - ఎవరో అందుకుని "ఇప్పుడే బయటికి వెళ్ళారు" అనడం తరచు వింటూ వుంటాం. అలా వెళ్ళినప్పుడు ఫోను నెంబరు తీసుకుని మర్యాదకోసం మళ్ళీ పిలవడం వుండదు. "ఎప్పుడు వస్తారు?" అంటే తెలియదంటారు. ఒకేరోజున పదిమాట్లు పిలిచినా ఆయన "బయటనే వుంటాడు గాని ఇంట్లో వుండడు."

మనం ఫోను చేయతలచినప్పుడల్లా "ఆయన్ని కొంచెం ఈసారి అయినా ఇంట్లో వుంచు భగవాన్" అని ప్రార్థించవలసి వస్తూ వుంటుంది.

ఒక్కొక్కసారి ఫోను చేసి అవతల వ్యక్తి పలుకుతాడేమోనని ఆశతో ఎదురు చూస్తుంటే - ఎవరిదో సంభాషణ వినిపిస్తుంది. ఒకప్పుడు ఉరుదులో, ఒకప్పుడు హిందిలో, అరవంలో, మరాటీలో మనం ఫోను ఎత్తిన వేళావిశేషాన్ని బట్టి వినిపిస్తూ వుంటాయి.

***గ్యాస్‌కాల్‌లో విందు సంభాషణ.***

ఇటీవల ఒకరోజున ఇంట్లో గ్యాస్ అయిపోయి వంటకు ఇబ్బందిగా వుండి వారికి ఫోను చేశాను. నాకు హిందీలో వినిపించిన సంభాషణ.

"అలా ఆలోచించాల్సిన పనిలేదు. మీరు అంగీకరించాల్సిందే"

"అంగీకరించడానికి కాదు సోదరా! నాకు వున్న ఇబ్బందులు చెప్పానుగదా. కొంచెం ఆలకించి మీరు క్షమిస్తారని"

"ఫర్వాలేదు భాయి. పదిగంటలకల్లా మీకు భోజనం తయారుగా వుంటుంది. మీరు అరగంటలో వెళ్ళిపోవచ్చు తప్పదు. "

"అలాగే మీ మాట ప్రకారమే వస్తాను. మిమ్మల్ని కాదనలేను. "

"మంచిది. చాలా సంతోషం. ఎదురు చూస్తూ వుంటా"

వంట చేసుకోవడానికి గ్యాసు లేక అలా కూర్చున్న వాళ్ళకు విందుల సంభాషణ వినిపిస్తే ఎలా వుంటుంది? నాలుగుసార్లు పిలిచినా అసలు నెంబరు అందలేదు.

***ఫోనులక్కూడా దుర్ముహూర్తాలుంటాయి***

"అలుపు వచ్చి పడిపోయిన రోజున అత్తగారే దిక్కు" అన్నట్లు కుంపటి వెతికి దొడ్లో చెట్టు కింద అక్కడక్కడా పడివున్న బొగ్గు ముక్కల్ని పువ్వుల్లాగా నీరుకు వచ్చి ముడి బియ్యాన్ని ముద్దల క్రింద మార్చుకున్నామనుకోండి.

తింటున్నంతసేపు ఫోనులో నిన్న విందు విషయమే జ్ఞాపకం వచ్చింది. ఎడ్రసు కూడా చెపితే పోయేది వాళ్ళు మేము కూడా వస్తున్నామని అక్కడికే ఫోను చేసి వెడితే పోయేది అనిపించింది.

ఫోనులక్కూడా దుర్ముహూర్తాలుంటాయల్లే వుంది. ఒక్కొక్కసారి అలా అనుకున్న పనులు కానియ్యవు.

Post your comments